సాక్షి తిరుపతి

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



గాలీవానకు రోడ్డుపై కూలిన వృక్షాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శుక్రవారం గాలీవాన ధాటికి శ్రీకాళహస్తి, బుచ్చినాయుడుకండ్రిగ కేటీ రోడ్డుపై భారీ వృక్షాలు నేలకూలాయి.



తొమ్మిది గంటల విద్యుత్

తిరుపతి రూరల్: రైతులకు వగటి పూటే తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	25
చిత్తూరు	38	26
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	39	27

న్యూస్‌రీల్

డీఎస్‌వోగా శేషాచలం రాజు



శేషాచలంరాజు, డీఎస్‌వో

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా పౌరసరఫరాల అధికారిగా శేషాచలం రాజు నియమితులయ్యారు. ఈయన చిత్తూరు సహాయ పౌరసరఫరాల అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై తిరుపతి జిల్లాకు వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. నాలుగు నెలల క్రితం డిప్యూటేషన్‌పై రాజమండ్రి నుంచి తిరుపతి జిల్లాకు విచ్చేసిన పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్‌ను తిరిగి రాజమండ్రికే బదిలీ చేశారు.

సురుటపల్లి వీఆర్‌ఓపై బదిలీ వేటు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం, సురుటపల్లి వీఆర్‌ఓ చంద్రశేఖర్‌ను అదే మండలంలోని టీపీ కోట సచివాలయానికి బదిలీ చేస్తూ తహసీల్దారు ప్రసన్నకుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం సురుటపల్లి గ్రామ సభలో రేణుబాబు ఇంటి పట్టా రద్దయినట్టు వీఆర్‌ఓ చంద్రశేఖర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో బాధితుడు ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్‌ఓను టీపీ కోటకు బదిలీ చేశారు. ఇతని స్థానంలో సురుటపల్లి వీఆర్‌ఓగా అదే మండలానికి చెందిన నందనం సచివాలయం వీఆర్‌ఓ సుకుమార్‌ను నియమిస్తున్నట్లు ఆదేశాలు జారీచేశారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి మే 4వ తేదీన తిరువణ్ణామలైకి బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు, 5వ తేదీ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మొత్తం 62 బస్సులను సిద్ధం చేశామని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్టు ఆయన పేర్కొన్నారు.

స్థల పరిశీలన



లైట్ హౌస్ వద్ద స్థల మ్యాప్‌లు పరిశీలిస్తున్న జేసీ బాలాజీ

వాకాడు: వాకాడు సముద్ర తీరంలో మెరైన్ పోలీస్‌స్టేషన్ జెట్టీ, టూరిజం ఏర్పాటుకు శుక్రవారం తిరుపతి జిల్లా జేసీ డీకే బాలాజీ, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌లు అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు పూడిరాయిదొరువు పంచాయతీ నవాబుపేట గ్రామం వద్ద మెరైన్ పోలీస్‌స్టేషన్ జెట్టీ నిర్మాణానికి అవసరమైన 0.5 సెంట్ల భూమిని ఇటీవల రెవెన్యూ అధికారులు కేటాయించడంతో ఆ స్థలాన్ని పరిశీలించారు. అలాగే టూరిజం ఏర్పాటుకు తూపిలిపాళెం బీచ్ వద్ద ఇప్పటికే కేటాయించిన 3.25 ఎకరాల భూమిని పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు. అదేక్రమంలో మొనపాళెం వద్ద లైట్ హౌస్ పర్యాటక ప్రాంతాన్ని అధికార బృందం పరిశీలించింది. వీరి వెంట తహసీల్దార్ నరసింహారావు, డీటీ సారంగపాణి, సర్వేయర్ విశ్వనాథం, ఫారెస్టు అధికారులు, వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

తిరునగరికి మరో మణిహారం

తిరునగరిలో అత్యాధునిక బస్టాండు నిర్మితం కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం ఈ బస్టాండ్‌ను నిర్మించనుంది. అందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. తిరుపతి బస్టాండ్‌లో దిగిన ప్రతి ప్రయాణికుడు, యాత్రికుడికీ అన్ని వసతులు సమకూరేలా నిర్మాణం జరగనుంది. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.500 కోట్లతో నిర్మించేందుకు అంచనాలు రూపొందించింది. అందుకు సంబంధించిన అనుమతులు కూడా మంజూరు చేసింది. వారం క్రితం తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ కూడా తీర్మానం చేసి ప్రతిపాదన పంపింది. త్వరలోనే టెండర్లు ఆహ్వానించనుంది. దీనిపై జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది.



తిరుపతి ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ ఊహా చిత్రం

- సకల వసతులతో అత్యాధునిక బస్టాండ్
- 13 ఎకరాల్లో నిర్మాణం
- మాస్టర్‌ప్లాన్‌ను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.500 కోట్లతో నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

సాక్షి, తిరుపతి: రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి నగరాన్ని మహానగరంగా అభివృద్ధి చేస్తోంది. అందులో భాగంగానే శ్రీనివాససేతు నిర్మాణం చేపట్టింది. అభివృద్ధిలో భాగంగా అతిముఖ్యమైన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఎక్కడా లేనివిధంగా తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనుంది. ప్రస్తుతం తిరుపతి, అలిపిరి, తిరుమల డిపోల నుంచి భక్తులు, పర్యాటకుల కోసం బస్సులు తిప్పుతున్నారు. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఆర్టీసీ ఏటా బస్సుల సంఖ్య పెంచాల్సి వస్తోంది. 2016లో 3,421 బస్సులు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 3,902కు చేరింది. ఈ కారణంగా ప్రసుతం ఉన్న బస్టాండు విస్తీర్ణంలో బస్సులు నిలిపేందుకు సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు అక్కడ వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బ్రహ్మోత్సవాలు, జాతర సమయాల్లో బస్టాండు జనసంద్రంగా మారుతోంది. ఈ నేపథ్యంలో తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు నూతన బస్టాండు నిర్మాణ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో హైటెక్ బస్టాండ్‌గా రూపుదిద్దుకోనుంది.

మల్టీప్లెక్స్ బస్టాండ్

నూతన బస్టాండు నిర్మాణంతో పాటు స్టాడింగ్‌కు అనువుగా, యాత్రికులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలోనే మోడల్ బస్టాండ్‌గా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించింది. అధునాతన హంగులతో బస్టాండును నిర్మించేందుకు నమూనా చిత్రాలను తీయించి విడుదల చేయించింది. యాత్రికుల టెర్మినల్ భవనం, బస్ స్టేషన్, కారు, ద్విచక్రవాహన పార్కింగ్, హెలిప్యాడ్, ఇతర రవాణాతో ఏకీకరణ, కమర్షియల్ కాంప్లెక్స్(రిటైల్ జోన్, ఫుడ్‌కోర్టు, హోటల్), మాడ్రన్ మరుగుదొడ్లు, తాగునీరు, భక్తుల కౌంటర్లు (రిజిస్ట్రేషన్, వెయిటింగ్ హాల్, ప్రత్యేక గదులు), వైద్య సౌకర్యాలు (ఫార్మసీ, అత్యవసరగది, అంబులెన్స్ తదితరాలు), బేబీకేర్ గదులు, ఏటీఎం, ఈవీ చార్జ్ స్టేషన్‌లతో పాటు సకల వసతులతో అత్యాధునిక బస్టాండ్ రూపుదిద్దుకోనుంది.

కొత్త బస్టాండు ఇలా..

విమానాశ్రయానికి 16 కి.మీ, రైల్వేస్టేషన్ 800 మీ, తిరుమలకు 22.1కి.మీ దూరంలో ఉండేలా విశాలమైన స్థలంలో బస్టాండ్ నిర్మాణం జరగనుంది. బస్టాండ్‌కు నాలుగువైపులా 60 అడుగుల రోడ్లను అనుసంధానం చేసేలా ప్లాన్ రూపొందించారు.

అద్భుతం

తిరుపతికి వచ్చిన భక్తుడు, పర్యాటకుల్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్టాండ్ ఉండాలని భావించాం. అందులో భాగంగా ప్రత్యేకంగా డిజైన్ చేయించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అత్యాధునిక బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నాం. తిరుపతికి వచ్చే ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోయేలా బస్టాండ్‌ని నిర్మించనున్నాం.

–మద్దెల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

బ్రహ్మాండం

తిరుపతిలో ఆర్టీసీ బస్టాండ్‌ని బ్రహ్మాండంగా నిర్మించనున్నాం. తిరుపతికి వచ్చే ప్రతి ఒక్కరికీ మంచి అనుభూతినిస్తుందని గట్టిగా చెప్పగలను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో అత్యాధునిక బస్టాండ్ నిర్మాణం జరుగనుంది. ఎంపీ కృషితో కేంద్ర ప్రభుత్వం కూడా బస్టాండ్ నిర్మాణంలో భాగస్వామ్యం కానుంది. త్వరలో టెండర్లు పిలిచి బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నాం.

– భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి



వెయిటింగ్ హాల్



టిక్కెట్ కౌంటర్

నూతన బస్టాండ్‌లో సమకూరే వసతులు

ప్లాట్‌ఫాంలు 500	బస్సులు 4000
రోజుకు ట్రిప్పులు 10000	ప్రయాణికులు 4 లక్షలు
షాపులు 1000	టాయిలెట్స్ 200
ఆస్పత్రులు 4	పార్కింగ్ స్థలాలు 10
మినరల్ వాటర్ ప్లాంట్స్ 5	మొబైల్స్ చార్జింగ్ పాయింట్లు 1000
బస్టాండ్లు 6 (శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు, అలిపిరి, మంగళం)	
ఉద్యోగులు 10,000 మంది	

- షాపింగ్ మాల్స్, థియేటర్లు, ప్రభుత్వ కార్యాలయాలు
- ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌తో విశాలమైన ప్లాట్‌ఫామ్‌లు
- అత్యంత అధునాతనమైన సౌకర్యాలతో బహుళ అంతస్తులు
- ఎయిర్‌పోర్ట్ తరహాలో ప్రయాణికులకు మెరుగైన వసతులు
- హైదరాబాద్, చెన్నై తరహాలో పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు, మాల్స్
- ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన గ్రీనరీ
- స్టార్ హోటల్స్ తరహాలో రెస్టారూమ్స్‌లు
- మల్టీప్లెక్స్ మూవీ థియేటర్లు, హోటల్స్
- ప్రధానమైన ప్రభుత్వ కార్యాలయాలు
- ప్రయాణికులకు వాకింగ్ ప్లాట్‌ఫామ్స్

తిరుపతికి ఐకాన్ శ్రీనివాససేతు

- శ్రీనివాస సేతు మూడో దశ ట్రయల్‌రన్ ప్రారంభం
- మనం చేసే పనులే మాట్లాడుకోవాలి
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



శ్రీనివాస సేతుపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీషా, కమిషనర్

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ ఆధ్యాత్మిక తిరుపతి నగరానికి ఐకాన్‌గా నిలుస్తుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. శ్రీనివాససేతు మూడో దశ పనులు పూర్తి కావడంతో శుక్రవారం మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం స్వయంగా వాహనాలు నడిపి ట్రయల్ రన్ నిర్వహించారు. తిరుచానూరు నుంచి తిరుపతిలోకి ప్రవేశించే మార్కెట్ యార్డ్ సర్కిల్ వరకు, శ్రీనివాససేతు మొదలయ్యి లక్ష్మీపురం సర్కిల్ మీదుగా రామానుజ సర్కిల్ నుంచి రేణిగుంట రోడ్డు వరకు ద్విచక్ర వాహనాలపై ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తూ సెల్ఫీలు దిగారు. డిప్యూటీ మేయర్ తన సెల్ ఫోన్‌లో ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్‌తోపాటు సెల్ఫీదిగి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిగిలిన పనులను వేగంగా పూర్తిచేసి త్వరలో ప్రజలకు ఫ్లైఓవర్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇప్పుడు ప్రారంభించిన ట్రయల్‌రన్‌ను పూర్తిస్థాయిలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతులమీదుగా అతిత్వరలో ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. తాము మాయమాటలు చెప్పకుండా అభివృద్ధిని చేతల్లో చేసి చూపిస్తున్నామని, మాటలు కాదు మేము చేస్తున్న పనులే భవిష్యత్‌లో మాట్లాడేలా చేస్తాయని ఆయన పేర్కొన్నారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ జూన్ చివరికల్లా పూర్తిస్థాయిలో శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె.బాబు, తమ్ముడు గణేష్, కార్పొరేటర్ ఆంజినేయులు, సూపరింటెండెంట్, ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆఫ్కాన్ స్వామి, ఏయికామ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస సేత మూడో దశ పనులు పూర్తికావడంతో ట్రయల్ రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, డెప్యూటీ మేయర్, కమిషనర్

రంజాన్‌కు సర్వం సిద్ధం

- నేడు పవిత్ర రంజాన్ పండగ
- ముస్తాబైన మసీదులు, ఈద్గాలు



తిరుపతి గాలివీధిలో ముస్తాబైన మసీదు

తిరుపతి కల్చరల్: పరమ పవిత్రమైన రంజాన్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. నెలవంక కనిపించడంతో శనివారం ముస్లింలు అత్యంత పవిత్రతతో, భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు జరుపుకోనున్నారు. నెల రోజుల పాటు నియమనిష్టలతో ఉపవాప దీక్షలు చేసి చివరి రోజు నెలవంకను దర్శించుకొని సామూహిక నమాజ్ ప్రార్థనలతో రంజాన్ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈద్గాలు, దర్గాలు రంజాన్ సామూహిక ఈదుల్ ఫితర్ నమాజ్‌కు సన్నద్ధమయ్యాయి. సామూహిక నమాజ్‌కు హాజరయ్యే ముస్లింలకు అవసరమైన చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. తిరుపతి ఎస్వీయూనివర్సిటీ సమీపంలోనున్న ఈద్గా మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం ఉదయం 9.30 గంటలకు ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజు ప్రారంభం కానుంది. ఈ మేరకు ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ డి.హరిత, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి పర్యవేక్షించారు.

26 నుంచి మెగా వైద్య పరీక్షలు

- చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఓ వరం
- మెగా వైద్య పరీక్షల నిర్వహణకు కమిటీల ఏర్పాటు
- ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే సదుద్దేశంతో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ రక్తపరీక్షలు, ఈసీజీ పరీక్షలు తుడా సహకారంతో నిర్వహించి రోగ నిర్ధారణ చేసి చికిత్స అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇది దేశంలో మొదటి సారిగా అమలు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంయుక్తంగా వైద్యాధికారులు, తుడా వీసీ, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో పేద ప్రజలకు అసంక్రమిత వ్యాధుల పరీక్షలు నిర్వహించి, రోగ నిర్ధారణ అయిన తర్వాత చికిత్సకు ఆరోగ్యశ్రీ సంబంధిత ఆస్పత్రికి లేదా ప్రయివేటు ఆసుపత్రికి రెఫర్ చేస్తామన్నారు. వారికి చికిత్సతో పాటు ఫాలో అప్ మందులు, గైడెన్స్, తరచూ గృహసందర్శన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఈ పరీక్షలు సుమారు 5 లక్షల మంది జనాభా కలిగిన చంద్రగిరి నియోజకవర్గంలో రోజువారీగా 104 వాహనాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తారని, ఆయా ప్రాంతాలు, వాటి తేదీలు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆస్పత్రుల యాజమాన్యాలు ఇందులో భాగస్వాములై వారి సిబ్బంది వివరాలను మ్యాపింగ్ చేసి సహకరించాలని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 24న ఉదయం కలెక్టరేట్ ఉద్యోగులకు, తుడా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. 26న చంద్రగిరి మండలం బండారుపల్లి గ్రామం నుంచి వైద్య పరీక్షలు ప్రారంభిస్తామన్నారు. తుడా వీసీ హరికృష్ణ, ఏఎస్‌డీసీ భాస్కర్ నాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయాధికారి రాజశేఖర్‌రెడ్డి, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, డీపీవో రాజశేఖర్, డీఎల్‌డీవో పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఏజెంట్' వైల్డ్‌గా ఉంటాడు

- సరికొత్త లుక్‌తో ప్రయత్నించా
- అక్కినేని అఖిల్ వెల్లడి



మాట్లాడుతున్న యువ హీరో అక్కినేని అఖిల్

తిరుపతి కల్చరల్: తన గత సినిమాల కంటే ఏజెంట్ చిత్రం కొత్తగా ఉంటుందని, తనను తాను నిరూపించుకునేందుకు ఏజెంట్ సినిమాలో వైల్డ్‌గా ప్రయత్నించానని యువ హీరో అక్కినేని అఖిల్ తెలిపారు. అక్కినేని అఖిల్, సాక్షి వైద్య హీరో హీరోయిన్స్‌గా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో నిర్మితమైన ఏజెంట్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా చిత్ర బృందం శుక్రవారం రాత్రి తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో సందడిచేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిల్ మాట్లాడుతూ దర్శకుడు సురేందర్‌రెడ్డి చెప్పిన కథ మేరకు ఆయన అందించిన సూచనలతో తన లుక్‌ను మార్చుకున్నానని తెలిపారు. అక్కినేని వారసత్వం తన భుజాలపై ఉన్నప్పటికీ తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకుంటున్నట్లు తెలిపారు.

చంద్రగిరిలో ఇఫ్తార్ పరిమళం

- ముస్లిం మత గురువులకు రూ.10వేల గౌరవ వేతనం
- 75 మసీదుల పరిధిలో రూ.7.5 లక్షల అందజేసిన మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: పవిత్ర రంజాన్ పర్వదినం వేళ ఇఫ్తార్ విందుల పరిమళం సర్వమత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. మత గురువులు వ్యాపారాలు, కుటుంబ వ్యవహారాలను పూర్తిగా పక్కనబెట్టి నెల రోజుల పాటు మసీదులకు పరిమతమై నిత్యం ప్రార్థనలు చేస్తూ అందరి క్షేమాన్ని కోరుకుంటుంటారు. ఈ నేపథ్యంలో మత గురువులు ఇబ్బందులు పడకుండా ఆదుకోవాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వారికి గౌరవ వేతనం ఇవ్వడానికి సంకల్పించారు. ఏడాదికి ఓసారి రంజాన్ పర్వదినాన మత గురువులకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అందించి తన ప్రేమను చాటుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, పాకాల, రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండలాల్లోని మసీదుల వద్దకు వెళ్లి అక్కడి ముస్లిం పెద్దల సమక్షంలో మత గురువులను సత్కరించారు. ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున 75 మంది మత గురువులకు రూ.7.5 లక్షలు గౌరవ వేతనాన్ని అందజేశారు. పలువురు మత గురువులు, పెద్దలు గజమాలలతో మోహిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.



మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న ముస్లింలు

అందరికీ రంజాన్ కానుక

ముస్లిం కుటుంబ సభ్యులందరికీ రంజాన్ వేళ ఇఫ్తార్ విందును ఇవ్వడంతో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రంజాన్ కానుకను పంపించారు. మత గురువులకు గౌరవ వేతనం అందించేందుకు మసీదుల వద్దకు వచ్చిన మోహిత్ రెడ్డిని స్థానిక ముస్లిం మహిళలు ఆత్మీయంగా అల్లాహ్ చల్లగా చూడాలని దీవెనలు అందించారు. ఇప్పటికే 16 వేల ముస్లిం కుటుంబాలకు రూ.3.4 కోట్లు ఖర్చు చేసి ఆరు రకాల నిత్యావసర వస్తువులతో కూడిన రంజాన్ కానుక పంపారు.

1 నుంచి ఏపీ సీఎం కప్ టోర్నమెంట్

తిరుపతి అర్బన్: నగరంలో మే 1 నుంచి 5వ తేదీ వరకు ఏపీ సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. నిజమైన క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏపీ సీఎం కప్ టోర్నమెంట్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. శుక్రవారం ఆయన తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో ఏపీ సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలోని 14 ప్రదేశాల్లో (గ్రౌండ్స్‌లో) ఏపీ సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి 4,999 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా ఈ టోర్నమెంట్‌లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, ఫుట్ బాల్, హ్యాండ్ బాల్, హాకీ, ఖోఖో, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. సమావేశంలో తిరుపతి ఆర్డీవో కనకనరసారెడ్డి, సీఈఓ సెట్విన్ మురళీకృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ఎమరాల్డ్స్‌లో ఘనంగా ఈ-క్వెస్ట్

తిరుపతి ఎడ్యుకేషన్: ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఈ-క్వెస్ట్-23 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీబీఏ విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకత వెలికితీయడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ బహుమతులు అందజేశారు. అచీవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అనన్య నారాయణ్ కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఎమరాల్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, శ్రీనివాసులు, నాథముని, జానకీరామ్, పార్థసారథి, ప్రిన్సిపల్ జాఫర్ వల్లి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్లు



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,090
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,546
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,900
రిటైల్ వెండి గ్రాము	రూ.78.90

ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీనివాస్



తిరుపతి మంగళం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా తిరుపతికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ నేత నైనారు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి రెండేళ్ల కాలపరిమితో ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది. గత ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ గెలుపునకు కృషి చేసిన బలిజ సామాజిక వర్గానికి చెందిన నైనారు శ్రీనివాస్ సేవలను గుర్తించి పార్టీ ఆయనకు ఈ పదవి కల్పించింది. ఈ సందర్భంగా నైనార్ శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



దినేష్(ఫైల్)



మోహన్(ఫైల్)

దొరవారిసత్రం: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన కలగుంట గ్రామ సమీపంలోని జాతీయ రహదారి ఫ్లెటైవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ రెండు ప్రమాదాలు పది నిమిషాల వ్యవధిలో జరగడం గమనార్హం. మృతుల్లో వాకాడు దినేష్(18) రోడ్డు పక్కనే ఉన్న ఎస్‌ఓఎస్ కాల్ బాక్స్ రేలింగ్ ఢీకుని అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి విన్నమాల మోహన్(26) ఫ్లెటైవర్ బ్రిడ్జిపై రేలింగ్‌ను ఢీకొట్టి ప్రాణాలు విడిచాడు. పోలీసుల కథనం... దొరవారిసత్రం మండలం, వేణుంబాకం ఎస్సీ కాలనీకి చెందిన విన్నమాల మోహన్ వంట మాస్టర్. ఈ క్రమంలో శుక్రవారం నాయుడుపేటకు బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తున్న సమయంలో బైక్ అదుపుతప్పి కలగుంట గ్రామ సమీపంలోని ఫ్లెటైవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు పక్కనే ఉన్న ఎస్‌ఓఎస్ కాల్ బాక్స్‌కు చెందిన సేఫ్టీ రేలింగ్‌ను ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందారు. అదే విధంగా నాయుడుపేట మండలం, పెరుకులపాటికండ్రిగ గ్రామానికి చెందిన దినేష్ సూళ్లూరుపేటకు బైక్‌పై వెళ్లి స్నేహితులతో మాట్లాడి తిరిగి నాయుడుపేటకు వెళ్లే క్రమంలో అదే ఫ్లెటైవర్ బ్రిడ్జిపై బైక్ అదుపుతప్పి ఇనుపరేలింగ్ ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మోహన్ రెండేళ్ల క్రితం మండలంలోని అక్కరపాక గ్రామానికి చెందిన శిల్పను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. సంతానం లేదు. సీఐ సోమయ్య, ఇన్‌చార్జి ఎస్ఐ కృష్ణారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మకు స్వరకుంభాభిషేకం

- విశిష్టతపై మంగ్లీ, ఎమ్మెల్యే భూమన గానం



రికార్డింగ్ స్టూడియోలో గానం చేస్తున్న మంగ్లీ



గానం చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగ ప్రకటించిన నేపథ్యంలో ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గంగమ్మ తల్లి విశిష్టత, జాతర ప్రత్యేకతల నేపథ్యంలో ।స్వర కుంభాభిషేకం౹ ఆల్బమ్ రూపొందిస్తున్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రముఖ గాయకుల చేత పాటలు పాడిస్తున్నారు. ప్రముఖ గాయని మంగ్లీ, మరికొందరు గాయకులు అమ్మవారి పాటలు పాడారు. అలానే ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కూడా గళం విప్పారు. స్వరకుంభాభిషేకం ప్రధాన పాటను ఎమ్మెల్యే భూమన చేత పాడించారు. ఇందుకు సంబంధించిన క్లిప్పింగ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తిరుపతికి చెందిన ఇంప్రస్ ఈవెంట్ ఆర్గనైజర్ కిషన్ సారథ్యంలో ఈ ఆల్బమ్ హైదరాబాదులో రికార్డు చేస్తున్నారు. శైలకుమార్ సాహిత్య పర్యవేక్షణ చేస్తున్నారు. బలగం సినిమా ఫేమ్ కాసర్ల శ్యామ్, సంపత్ కుమార్, జస్వంత్ సాహిత్యాన్ని సమకూర్చారు.

ఏడాదికి 12 ప్రయోగాలు

- రాబోయే మూడు నెలల్లో మూడు ప్రయోగాలు
- నేడు పీఎస్‌ఎల్‌వీ సీ55 ప్రయోగం
- ఇది పూర్తిగా వాణిజ్యపరమైనది
- ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి
- చెంగాళమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇక నుంచి ఏడాదికి 12 ప్రయోగాలే లక్ష్యంగా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లో ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసినట్టు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు ప్రయోగించనున్న పీఎస్ఎల్‌వీ సీ55 ప్రయోగం విజయవంతం కావాలని శుక్రవారం ఆయన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ అళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలక మండలి సభ్యులు సాదరంగా స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం ఆయన్ని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ పీఎస్ఎల్‌వీ సీ55 రాకెట్‌కు శుక్రవారం మధ్యాహ్నం 12.50 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించామని, ప్రస్తుతం కౌంట్‌డౌన్ ప్రక్రియ సజావుగా సాగుతోందని చెప్పారు. అయితే ఈ ప్రయోగం ఇస్రో, న్యూ స్పేస్ ఇండియా చేస్తున్న పూర్తిస్థాయి ఐదో వాణిజ్యపరమైన ప్రయోగమన్నారు. సింగపూర్‌కు చెందిన టెలియోస్-2, లూమిలైట్-4 అనే రెండు ఉపగ్రహాలను రోదశీలోకి పంపిస్తున్నామని తెలిపారు. ఈ ప్రయోగంలో రాకెట్‌లోని నాలుగోదశ (పీఎస్-4)తో ఒక ప్రత్యేక ఎక్స్‌పరమెంటల్ చేస్తున్నామని చెప్పారు. ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి వదిలిపెట్టిన తరువాత పీఎస్-4 మరింత పైకి వెళ్లి మరో ఎనిమిది చిన్నపాటి పేలోడ్లను కూడా వదిలిపెడుతుందన్నారు. దీన్ని మొట్టమొదటిసారిగా ప్రయోగాత్మకంగా చేస్తున్నామని వివరించారు. ఈ ప్రయోగాన్ని 35 రోజుల్లోనే రెడీ చేశామని వెల్లడించారు. రాబోయే మూడు నెలల్లో జీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా నావిక్ అనే ఉపగ్రహం, అలాగే చంద్రుడిపై పరిశోధనలు చేసేందుకు చంద్రయాన్-3, సౌరగోళంలో పరిశోధనలు చేసేందుకు ఆదిత్య-ఎల్1 అనే మూడు ప్రయోగాలు చేపట్టేందుకు అంతా సిద్ధం చేస్తున్నామన్నారు. అయితే ప్రస్తుతం మొదటి ప్రయోగ వేదికకు అనుసంధానంగా పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటి భవనం, రెండో ప్రయోగవేదికకు అనుసంధానంగా రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ అందుబాటులోకి రావడంతో ఇకనుంచి 35 రోజుల్లో ఒక రాకెట్ తయారు చేసి సంవత్సరానికి 12 ప్రయోగాలే లక్ష్యంగా పనిచేయబోతున్నామని ఆయన స్పష్టం చేశారు.. ఆయన వెంట గ్రూప్ మేనేజర్ గోపీకృష్ణ తదితరులున్నారు.



చెంగాళమ్మ ఆలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్

నేడు వరల్డ్ ఎర్త్‌డే

తిరుపతి అర్బన్: వరల్డ్ ఎర్త్ డే దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించానికి ఏర్పాట్లు చేపడుతున్నట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నరేంద్రబాబు తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటలకు తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి అలిపిరి రోడ్డులోని రామచంద్ర పుష్కరిణి వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఉద్యోగావకాశాలు

తిరుపతి అర్బన్: అమరరాజా కంపెనీలో బస్సు డ్రైవర్లుగా పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్‌మోహన్ తెలిపారు. ఆధార్, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు 6303578886 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. నెలకు రూ.17వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.

వ్యవసాయానికి పగటిపూటే తొమ్మిది గంటల విద్యుత్

- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు • తిరుపతిలో బాధ్యతల స్వీకరణ



కుడారి సంతోషరావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి రూరల్: 'రైతులకు పగటిపూటే తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తాం. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఐటీ విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి దేశంలోనే అత్యుత్తమ డిస్కంగా ఎస్పీడీసీఎల్‌ను తీర్చిదిద్దుతాం' అని ఎస్పీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన కుడారి సంతోషరావు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సీఎండీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యంగా ముందుకు సాగుతాం. వ్యవసాయ కనెక్షన్లను సైతం వేగంగా అందిస్తాం. ఇన్‌చార్జ్ సీఎండీ ఉన్న తొమ్మిది నెలల వ్యవధిలోనే 65,207 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను అందించాం.

ఐటీ వింగ్ మరింత బలోపేతం

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ డిస్కంలోనూ డిజిటల్ వెలుగులు నింపుతాం. అందుకోసం ఐటీ వింగ్‌ను మరింత బలోపేతం చేస్తాం.

జగనన్న కాలనీల్లో వంద శాతం విద్యుదీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీల్లో వందశాతం విద్యుదీకరణ పనులు చేపడుతున్నాం. డిస్కం పరిధిలోని 1308 లేఅవుట్లలో 3,408 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 554 కిలోమీటర్ల మేర 11కేవీ లైన్లు, 3,070 కిలోమీటర్ల మేర ఎల్‌టీ లైన్లను ఏర్పాటు చేశాం. డిమాండ్‌కు అనుగుణంగా దాదాపు 35 సబ్‌స్టేషన్లను నిర్మించాం.

కృతజ్ఞతలు

ఈపీడీసీఎల్ సీఎండీ 21 నెలల పాటు పనిచేశా. అదేసమయంలో ఎస్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ సీఎండీగా తొమ్మిది నెలల పాటు పనిచేసే భాగ్యం కలిగింది. తాజాగా మరో రెండేళ్ల పాటు ఎస్పీడీసీఎల్ సీఎండీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.. అని ఆయన పేర్కొన్నారు.